


# వర్కర్స్ యూనిటీ జిందాబాద్

హైదరాబాద్ నుంచి రామచంద్రాపురానికి వెళ్ళేదారిలో వున్న ఓ లిమిటెడ్ కంపెనీ ఫేక్టరీ అది. ఆ ఫేక్టరీ ముందున్న ఆఫీస్ బిల్డింగ్ లోని వర్క్స్ డైరెక్టర్ ఆఫీస్ గది అది. ఆ గదిలో ఆయనతో పాటు మరొక ఇద్దరున్నారు. ఆ ఇద్దరూ ఆ కంపెనీ వర్కర్స్ యూనియన్ లీడర్లు. ఒకతని పేరు ఇంద్రసేనరావు. మరొకతని పేరు యాదగిరి.

గత పద్దెనిమిది రోజులుగా వారిద్దరి ఆధ్వర్యంలో సమ్మె జరుగుతోంది. చాలాకాలంగా వర్కర్స్ యూనియన్ కోరుతున్న ఎనిమిది డిమాండ్స్‌ని మేనేజ్‌మెంట్ నిరాకరిస్తూండటం చేత సమ్మె నోటీసు జారీ చేశారు. మేనేజ్‌మెంట్ తమ డిమాండ్స్‌ని అంగీకరించక పోవడంతో సమ్మెలోకి దిగారు.

పద్దెనిమిది రోజులుగా ఫేక్టరి ముందు రిలే నిరాహారదీక్ష చేస్తూ, నినాదాలు చేస్తూ సమ్మె చేస్తున్నారు వర్కర్స్. వర్క్స్ డైరెక్టర్‌కి కంపెనీ చెయిర్‌మన్‌కి ఏవో విషయాల్లో భేదాభిప్రాయం రావటం వల్ల వర్క్స్ డైరెక్టర్స్ రాజీనామా చేసాడు. ఆయన స్థానంలో పార్వతీపతి అనే కొత్త వ్యక్తి నియమింపబడ్డాడు. ఈ నియామకం జరిగి అయిదు రోజులైంది. పాతవర్క్స్ డైరెక్టర్ వర్కర్స్ డిమాండ్స్‌లలో ఏ ఒక్కటీ అంగీకరించలేదు. ఆ రోజు పార్వతీపతికి, యూనియన్ లీడర్స్ ఇద్దరికి సంప్రదింపులు జరుగుతున్నాయి.

పరిచయాలయాక పార్వతీపతి వాళ్ళ సమ్మె నోటీసుని, డిమాండ్స్‌ని పరిశీలించాడు. అందులో అయిదు డిమాండ్స్ చాలా చిన్నవి. వాటిని ఇదివరకే ఎందుకు అంగీకరించలేదో పార్వతీపతికి అర్థంకాలేదు.

"ఆడవాళ్ళకి ప్రత్యేకంగా లంచ్ రూం ఏర్పాటుచేస్తాం. మీరు కోరినట్లుగానే చిన్న పార్టిషన్ వాల్ కడితే చాలు-పెద్ద ఖర్చేకాదు. మరో పాతిక సైకిళ్ళు పట్టే సైకిల్ స్టాండ్ కూడా కట్టిస్తాం. వర్షా కాలంలో సైకిళ్ళు తడిసి పాడయిపోతాయన్న మాట వాస్తవమే. రోజూ ఉదయం పంచ్ చేసే గడియారాలని రేడియో టైంతో చూసి సరిచేస్తాం. అవి ఫాస్ట్‌గా తిరిగే అవకాశమే వుండదిక..."

యాదగిరి, ఇంద్రసేనరావు మొదటి అయిదు డిమాండ్స్ వప్పుకున్నందుకు సంతోషపడ్డారు.

తర్వాతి మూడిటిలో ఏ ఒక్కటి వప్పుకున్నా కంపెనీకి అదనంగా నెల నెలా ఖర్చు పెరుగుతుంది. యూనిఫాం ధరించే వర్కర్స్‌కి వాషింగ్ అలవెన్స్ పెంచడానికి పార్వతీపతి అంగీకరించాడు.

"థాంక్స్" చెప్పాడు ఇంద్రసేనరావు.

"మీలాంటివారు మేనేజ్‌మెంట్‌లో వుండటం మా అదృష్టం" చెప్పాడు యాదగిరి ఆనందంగా

"మీ మిగతా రెండు డిమాండ్స్ కూడా వప్పుకుంటున్నాను. రేపటి నించి పనిలో చేరండి" చెప్పాడు పార్వతీపతి లెక్కలువేసిచూసుకుని

సమ్మెవల్ల వుత్పత్తి ఆగిపోయి వచ్చేనష్టం కంటే వాళ్ళ కోరికలు తీర్చడమే లాభదాయకంగా భావించాడు పార్వతీపతి

యాదగిరి, ఇంద్రసేనరావు ఒకరి మొహాలవంక మరొకరు చూసుకున్నారు తర్వాత పార్వతీపతిని అడిగారు నమ్మలేనట్లుగా

"అన్ని డిమాండ్స్ వప్పు



కున్నారా?"

"అవును. మరో నాలుగేళ్ళ దాకా సమ్మె చేయమని మీరు వప్పుకుంటే వీటిని వెంటనే అమలు పరిచే ఏర్పాటు చేస్తాను"

యూనియన్ లీడర్స్ ఇద్దరి మొహాల్లో వెంటనే అసంతృప్తి ప్రవేశించడం గమనించి అడిగాడు పార్వతీపతి.

"ఇంకా ఏమిటి?"

"ఈ ఎనిమిదిలో మీరు కేవలం నాలుగు డిమాండ్స్ అంగీకరిస్తే చాలు ప్రస్తుతానికి."

"అదేం?" ఆశ్చర్యపోయాడు పార్వతీపతి

"అది అంతే మీరన్ని వప్పుకుంటే నాలుగేళ్ళదాకా మాకు వర్కర్స్‌లో విలువేం వుంటుంది?"

అయిదు నిముషాల తర్వాత బయటికివచ్చి చెప్పారు ఇద్దరూ బయట వేచివున్న సోదర కార్మికులతో

"కామ్రేడ్స్ మన యూనియన్ తరపున గట్టిగా పోట్లాడి మొత్తానికి నాలుగు డిమాండ్స్‌ని అంగీకరించేలా చేసాం. ఇది మనకి పెద్ద విజయం. రేపటినించి పనితో చేరుదాం. వర్కర్స్ యూనిటీ జిందాబాద్"

"వర్కర్స్‌యూనిటీజిందాబాద్."

కామ్రేడ్స్ ఇంద్రసేనరావు జిందాబాద్. కామ్రేడ్ యాదగిరి జిందాబాద్" గొంతుచించుకుని అరిచారు సోదర కార్మికులు సంతోషంగా.

✱